క్లుప్తంగా

అన్నానగర్‌లో ఆలయాల పునర్నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన పూజ చేస్తున్న మేయర్ హరివెంకటకుమారి

ఆరిలోవ: జీవీఎంసీ 11వ వార్డు బాలాజీనగర్ దరి అన్నానగర్‌లో గ్రామ సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో పలు ఆలయాల పునర్నిర్మాణం చేపట్టారు. దీని కోసం శనివారం నిర్వహించిన శంకుస్థాపన కార్యక్రమంలో మేయర్ గొలగాని హరివెంకటకుమారి పాల్గొని పూజలు చేశారు. ఇక్కడ షిర్డీసాయిబాబా, రామాలయం, విఘ్నేశ్వర సహిత శివాలయం, నల్ల మారెమ్మ ఆలయాల నిర్మాణం చేపడుతున్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ గ్రామ ప్రజల సహకారంతో సంఘం ఆధ్వర్యంలో ఆలయాలు పునర్నిర్మాణం జరగడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో గ్రామ సంఘం సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

విజయదుర్గాదేవికి సారె సమర్పణ



పోలమాంబకు పిండివంటలతో పూజలు చేస్తున్న మహిళలు

ఆరిలోవ: జీవీఎంసీ తొమ్మిదో వార్డు విజయదుర్గా కాలనీలోని విజయదుర్గా ఆలయ వార్షికోత్సవం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా సంజయ్‌గాంధీ కాలనీలోని పోలమాంబ ఆలయం నుంచి మహిళలు సారె పదార్థాలు పట్టుకొని విజయదుర్గాదేవి ఆలయానికి ఊరేగింపుగా వెళ్లారు. ముందుగా పోలమాంబ అమ్మవారికి పూజలు చేసి అక్కడ నుంచి సారె తీసుకుని మేళతాళాలతో బయలుదేరారు. విజయదుర్గాదేవికి సారె సమర్పించి పూజలు చేశారు. ఆలయ ఆవరణలో సాయంత్రం నిర్వాహకులు జాతర, పరస, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

విమ్స్‌లో సిబ్బందికి అందని వేతనాలు

ఆరిలోవ: విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్)లో పనిచేస్తున్న కొన్ని విభాగాల సిబ్బంది వేతనాలు అందక ఇబ్బంది పడుతున్నారు. నెలల తరబడి వేతనాల కోసం ఎదురు చూస్తున్నారు. ఇక్కడ పారిశుధ్య సిబ్బంది, సెక్యూరిటీ సిబ్బందిని వేర్వేరు ఏజెన్సీలు నిర్వహిస్తున్నాయి. ఆయా ఏజెన్సీల సిబ్బందికి వేతనాలు మాత్రం సకాలంలో చెల్లించడం లేదు. దీంతో పిల్లల స్కూల్ ఫీజులు చెల్లించలేని పరిస్థితిలో ఉన్నామని కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సెక్యూరిటీ సిబ్బందికి రెండు నెలల నుంచి, పారిశుధ్య సిబ్బందికి మూడు నెలల నుంచి ఆయా ఏజెన్సీలు వేతనాలు చెల్లించకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. సెక్యూరిటీ సిబ్బంది 45 మంది, పారిశుధ్య సిబ్బంది 75 మంది పనిచేస్తున్నారు. విమ్స్ డైరెక్టర్ కలుగజేసుకొని ఏజెన్సీల ద్వారా సకాలంలో వేతనాలు చెల్లించేలా చర్యలు చేపట్టాలని సిబ్బంది కోరుతున్నారు.

ఉత్సాహంగా ఆలోచన దినోత్సవం



ర్యాలీలో పాల్గొన్న బుల్లయ్య కళాశాల స్కౌట్స్ అండ్ గైడ్స్

సీతంపేట: స్థానిక లంకపల్లి బుల్లయ్య కళాశాలలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్స్ ఆధ్వర్యంలో ప్రపంచ ఆలోచన దినోత్సవాన్ని (వరల్డ్ థింకింగ్ డే) ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీని టాస్క్‌ఫోర్స్ సీఐ బంగారుపాప ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ యువత ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు, వాటికి పరిష్కారాలను వివరించారు. ఆలోచనా దినోత్సవాన్ని నిర్వహించిన కళాశాల రోవర్స్, రేంజర్స్ విద్యార్థులను కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్ అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ జి.ఎస్.కె.చక్రవర్తి, డి.దీపక్ చౌదరి, రోవర్ లీడర్స్ మేజర్ టి.బ్రహ్మానందరెడ్డి, ఫ్లైట్ లెఫ్టినెంట్ బి.ఆర్.ఎస్.లక్ష్మణరెడ్డి, రేంజర్ లీడర్స్ గంగా భవాని, స్వాతికృష్ణ యాదవ్, సూర్య ఎల్లమాంబేశ్వరి పాల్గొన్నారు.

అడుగడుగునా ఆక్రమణ



దారపాలెం వద్ద బీఆర్‌టీఎస్ స్థలంలో ఓ మోటార్స్ సంస్థ నిర్మిస్తున్న షెడ్



దారంపాలెం, అడవివరం మధ్యలో నిర్మించిన షెడ్

స్థానిక బీఆర్‌టీఎస్ రహదారికి చెందిన స్థలం ఆక్రమణకు గురవుతోంది. గ్రీన్‌బెల్ట్ కోసం కేటాయించిన స్థలాలు, రోడ్డు విస్తరణ కోసం సిద్ధం చేసిన స్థలాలతోపాటు ఫుట్‌పాత్‌లు ఆక్రమణల పాలవుతున్నాయి. జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు మాత్రం వీటితో సంబంధం లేనట్లు వ్యవహరించడంతో ఆక్రమణలకు అడ్డూ అదుపూ లేకుండా పోతోంది. బీఆర్‌టీఎస్ రోడ్డులో జోరుగా.. ఇష్టారాజ్యంగా ఆక్రమణలు జరుగుతున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు.

- ఆక్రమణల చెరలో బీఆర్‌టీఎస్ రహదారి
- కనుమరుగవుతున్న గ్రీన్‌బెల్ట్ స్థలాలు
- ఫుట్‌పాత్‌లపై ఇష్టారాజ్యంగా దుకాణాల ఏర్పాటు
- ఇబ్బంది పడుతున్న స్థానికులు, పాదచారులు

ఆరిలోవ: జీవీఎంసీ జోన్–2 పరిధిలో హనుమంతవాక నుంచి అడవివరం మీదుగా సింహాచలం వరకు బీఆర్‌టీఎస్ రహదారి నిర్మించారు. 2008లో ప్రారంభించిన దీని నిర్మాణం వీలును బట్టి నాలుగు లైన్లు, ఐదు లైన్లు రోడ్డు చేపట్టారు. రోడ్డుకు ఇరుపక్కలా పాదచారుల కోసం ఫుట్‌పాత్‌లు నిర్మించారు. వాటి నుంచి ఇరువైపులా 20 అడుగులకు పైగా ఖాళీ స్థలాన్ని విడిచిపెట్టారు. భవిష్యత్తులో బీఆర్‌టీఎస్ విస్తరణ చేపట్టే సమయంలో ఆ స్థలాన్ని వినియోగించాలని జీవీఎంసీ అధికారులు ముందుగానే సిద్ధం చేసుకున్నారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న ఈ స్థలాన్ని గ్రీన్‌బెల్ట్‌గా వినియోగించాల్సి ఉంది. రోడ్డు నిర్మాణం చేపట్టి సుమారు దశాబ్దం గడిచినా ఇంతవరకు అధికారులు ఎక్కడా గ్రీన్‌బెల్ట్ ఏర్పాటు చేయలేదు.. సరికదా హనుమంతవాక నుంచి పెదగదిలి, చినగదిలి, దీన్‌దయాల్‌పురం వరకు ఉన్న ఖాళీ స్థలంలోని పచ్చని మొక్కలను సైతం నాశనం చేసి సామాజిక భవనాలు, గుడులు నిర్మించేశారు.

ఖాళీ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు

బీఆర్‌టీఎస్ విస్తరణ కోసం జీవీఎంసీ విడిచిపెట్టిన ఖాళీ స్థలం ఇప్పుడు పైనాపిల్ కాలనీ, దారపాలెం ప్రాంతాల్లో ఆక్రమణకు గురైంది. ఇప్పటికే కొందరు ఫుట్‌పాత్‌లను అనుకుని షెడ్‌లు నిర్మించేశారు. జీవీఎంసీ అధికారులు వాటిని అడ్డుకోకపోవడంతో విచ్చలవిడిగా ఆక్రమణలు జరుగుతున్నాయి. కొద్ది రోజులుగా వరుణ్ మోటార్స్ సంస్థ నిర్వాహకులు దారపాలెం వద్ద ఫుట్‌పాత్‌ను ఆనుకొని పెద్ద షెడ్ నిర్మిస్తున్నారు. ఆగమేఘాలపై రాత్రి వేళల్లో సైతం దీని పనులు జరుపుతున్నారు. దీనికి సమీపంలో రెండు షెడ్‌లు(గొడౌన్‌లను తలపించే విధంగా), దానికి ఎదురుగా ఓ కార్ మెకానిక్ షెడ్, మరో గొడౌన్ నిర్మాణం చేపట్టారు. వీటి ఆక్రమణతో ఖాళీ స్థలాలు కనిపించకుండా పోతున్నాయి. దీంతో బీఆర్‌టీఎస్ రోడ్డు విస్తరణ జరగాల్సి వస్తే జీవీఎంసీ మళ్లీ స్థలాలు కొనుక్కోవాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు ఆయా ఆక్రమణలను అడ్డుకోకుండా ఆక్రమణదారులకు సహకరిస్తున్నారంటూ స్థానికుల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఫుట్‌పాత్‌లపై విచ్చలవిడిగా దుకాణాలు



దారంపాలెం వద్ద ఫుడ్‌పాత్‌పై టిఫిన్, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు

బీఆర్‌టీఎస్ రోడ్డుకు ఇరుపక్కలా నాలుగడుగుల వెడల్పుతో ఫుట్‌పాత్‌లు నిర్మించారు. ఈ రహదారిపై వాహనాల రద్దీ దృష్ట్యా అధికారులు పాదచారుల సౌలభ్యం కోసం నిర్మించిన ఫుట్‌పాత్‌లపై విచ్చలవిడిగా దుకాణాలు ఏర్పాటు చేశారు. దారపాలెం, పైనాపిల్ కాలనీ, శ్రీకృష్ణాపురం, రామకృష్ణాపురం, దీన్‌దయాల్‌పురం నుంచి పెదగదిలి, సంజయ్‌గాంధీ కాలనీ వరకు గల కాలిబాటలు ఆక్రమణకు గురయ్యాయి. దారంపాలెం నుంచి పైనాపిల్ కాలనీ వరకు ఫుట్‌పాత్‌లపై టిఫిన్ సెంటర్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు నిర్వహిస్తున్నారు. దీన్‌దయాల్‌పురం నుంచి చినగదిలి, పెదగదిలి, సంజయ్‌గాంధీ కాలనీ వరకు టిఫిన్ సెంటర్లతోపాటు తుక్కు వ్యాపారాలు సైతం వీటిపైనే జరుగుతున్నాయి. దీంతో ఈ రోడ్డుపై పాదచారులు నడచి వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. కొన్ని సందర్భాల్లో ఫుట్‌పాత్‌లపై ఉన్న దుకాణాల వద్ద వాహనాలు రాంగ్ పార్కింగ్ చేయడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రోడ్డుపై నిత్యం వాహనాల రద్దీ ఉంటుంది. ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్ చేసే వారు ఫుట్‌పాత్‌లను ఉపయోగించలేకపోతున్నామని చెబుతున్నారు. కొన్నిసార్లు రోడ్డు మీదకు దిగితే వాహనాలు ఢీకొని ప్రమాదాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ ఉన్నతాధికారులు స్పందించి బీఆర్‌టీఎస్ రోడ్డు, ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలను అడ్డుకోవాలని పలువురు స్థానికులు కోరుతున్నారు.

గ్రూప్–2 అభ్యర్థుల ధర్నాతో ట్రాఫిక్ జామ్

హెచ్‌బీ కాలనీ, ఎంవీపీ సర్కిల్ మీదుగా వాహనాల మళ్లింపు



ఎంవీపీ కాలనీ రోడ్డులో నిలిచిపోయిన వాహనాలు



హైవేపై ఇసుకతోట జంక్షన్‌లో భారీగా ట్రాఫిక్ జామ్

మద్దిలపాలెం: ఏపీపీఎస్సీ గ్రూప్–2 మెయిన్స్ పరీక్షను వాయిదా వేయాలని కోరుతూ వందలాది మంది అభ్యర్థులు శనివారం రాత్రి ఇసుకతోట కూడలి వద్ద మెరుపు ధర్నా చేశారు. దీంతో ఇసుకతోట జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. ట్రాఫిక్ పోలీసులు రంగప్రవేశం చేసి వాహనాల మళ్లింపు చర్యలు చేపట్టారు. విజయనగరం నుంచి వచ్చే వాహనాలను వెంకోజీపాలెం సిగ్నల్ నుంచి ఎంవీపీ కాలనీ, ఉషోదయ కూడలి మీదుగా ట్రాఫిక్ మళ్లించారు. దీంతో ఎంవీపీ కాలనీలోని వీధులన్నీ వాహనాలతో నిండిపోయాయి. ఇటు మద్దిలపాలెం నుంచి విజయనగరం వెళ్లే వాహనాలను హెచ్‌బీ కాలనీ వైపు నుంచి మళ్లించారు. హెచ్‌బీ కాలనీ ప్రధాన రహదారిపై సంత జరుగుతుండటంతో ఎక్కడికక్కడ వాహనాలు కిక్కిరిసిపోయాయి. వీటి నియంత్రణకు ట్రాఫిక్ సిబ్బంది చర్యలు చేపట్టారు. ఈ సమస్య సుమారు రెండు గంటల పాటు కొనసాగింది. దీంతో వాహన చోదకులు తీవ్ర అసహనానికి గురయ్యారు. నిరసన రాత్రి 10 గంటల వరకూ కొనసాగించడంతో బస్సులు, ఇతర వాహనాలన్నింటినీ ఎంవీపీ మీదుగా అనుమతించారు. దీంతో ఉషోదయ జంక్షన్, త్రీటౌన్ ఇంజినీరింగ్ కళాశాల మీదుగా వాహనాలు మద్దిలపాలెం వైపు నడిచాయి.

యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తి కాపాడాలి



ఏయూ మెయిన్ గేటు వద్ద ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

విశాఖ విద్య: యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తిని కాపాడాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి యు.నాగరాజు విజ్ఞప్తి చేశారు. విద్యా రంగ సమస్యలపై ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణిని నిరసిస్తూ శనివారం ఆంధ్రా యూనివర్సిటీ మెయిన్ గేటు ముందు ధర్నా చేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే జీవో నంబర్ 77 రద్దు చేస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. యూనివర్సిటీ స్వయం ప్రతిపత్తి కాపాడేలా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఉమ్మడి పీజీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ రద్దు చేస్తామని పాదయాత్రలో లోకేష్ ఇచ్చిన హామీ పూర్తిగా మర్చిపోయారని ఎద్దేవా చేశారు. విద్యా శాఖ మంత్రి ట్విట్టర్‌లో పోస్ట్ పెట్టడానికో లేదా రెడ్ బుక్ రాజ్యాంగంతో కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారే తప్ప.. విద్యార్థుల సమస్యలు పరిష్కరించడంపై శ్రద్ధ చూపడం లేదన్నారు. అడ్మినిస్ట్రేషన్ వ్యవహారం అంతా యూనివర్సిటీ పరిధిలో జరిగేలా పూర్తి అధికారం ఉప కులపతికి ఇవ్వాలని, రాష్ట్రవ్యాప్త కామన్ పీజీ ఎంట్రన్స్ టెస్ట్ రద్దు చేసి, యూనివర్సిటీ పరిధిలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి.శేఖర్, యూనివర్సిటీ కార్యదర్శి జె.అభిషేక్, హేమానంద్, నెహేమియ, శివ రాజ్, కంజీర, చింటూ, నూతన్, హరి, స్వాతి, యూనివర్సిటీ విద్యార్థులు పాల్గొన్నారు.

విదేశీ విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



చికిత్స పొందుతున్న విదేశీ విద్యార్థినిని పరామర్శిస్తున్న ఏయూ రిజిస్ట్రార్

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీలో విద్యనభ్యసించే విదేశీ విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని రిజిస్ట్రార్ ఆచార్య ధనుంజయరావు తెలిపారు. ఆరోగ్యపరమైన సమస్యతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్‌లో బీబీఏ విద్యార్థిని సమంగాలే జుంగూను శనివారం ఆయన పరామర్శించారు. తీవ్రమైన జ్వరంతో బాధపడిన విదేశీ విద్యార్థిని ఆరోగ్యం కుదుటపడేలా ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్సలు అందించారు. ప్రస్తుతం విద్యార్థిని పూర్తిగా కోలుకోవడంతో ఐసీయూ నుంచి రెండు రోజుల క్రితం రూమ్‌కు మార్చారు. ప్రాణపాయం నుంచి బయటపడి విద్యార్థిని పూర్తి ఆరోగ్యంతో ఉన్నట్లు ఆస్పత్రి వైద్యులు తెలిపారు. విద్యార్థిని ఆరోగ్యంగా కోలుకోవడంపై ఏయూ రిజిస్ట్రార్ సంతోషం వ్యక్తం చేశారు.

రైల్వే స్టేషన్‌లో 60 కేజీల గంజాయి స్వాధీనం



నిందితులు, స్వాధీనం చేసుకున్న గంజాయితో జీఆర్పీ, ఆర్పీఎఫ్ అధికారులు, సిబ్బంది

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వే స్టేషన్ మీదుగా గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్న ముగ్గురిని రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ... విశాఖపట్నం జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ ఎ.రవికుమార్, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ సిబ్బందితో కలిసి శనివారం విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో ముమ్మర తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో ఢిల్లీకి చెందిన బినా, పూజా అరోరా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రం బరేలి జిల్లాకు చెందిన వివేక్ విశాఖపట్నం స్టేషన్ మీదుగా అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. ముగ్గురినీ అదుపులోకి తీసుకుని, వారి నుంచి 60 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరిచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

భూ ఆక్రమణపై ఫిర్యాదు

బీచ్‌రోడ్డు: విశాఖ పోర్టులో షిపింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తున్న బోత్ర కంపెనీ ఒక ప్రైవేటు స్థలంలో అక్రమంగా రోడ్డు నిర్మించి దందా నిర్వహిస్తున్న తీరుపై విశాఖ ఐజీకి ఫిర్యాదు అందింది. శనివారం ఐజీ కార్యాలయంలో స్థలం యజమాని శేషారెడ్డి భూ ఆక్రమణపై ఫిర్యాదు చేశారు. వివరాలిలా.. పరవాడ మండలం స్వయంబువరం గ్రామంలో సర్వే నంబర్ 34లోని 3.65 ఎకరాల భూమిని స్థానంరెడ్డి శేషారెడ్డి, కశిరెడ్డి రంగారావు, అచ్యుత రామరాజు కలిసి కొనుగోలు చేశారు. ముగ్గురు సమాన వాటాలతో భూమిని రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. నిర్వహణ బాధ్యతను రామరాజుకు అప్పగించారు. అతడు మిగిలిన తమ ఇద్దరి అనుమతి లేకుండా బోత్ర కంపెనీతో లోపాయికారి ఒప్పందం కుదుర్చుకుని, ఆ స్థలంలో అక్రమంగా రోడ్డు నిర్మించి హిందూ ప్లాంట్‌కు కోల్ సరఫరా చేస్తున్నారని శేషారెడ్డి ఫిర్యాదులో పేర్కొన్నారు. వేరే రోడ్డు మార్గంలో సరఫరా చేయకుండా తమ సొంత స్థలాన్ని అనుమతి లేకుండా ఆక్రమించుకొని అక్రమంగా కోట్ల రూపాయలు దండుకుంటున్నారని ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని కోరారు.


స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు రిజర్వేషన్లు పెంచాలి



స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు బహుమతులు అందజేస్తున్న అతిథులు

తాటిచెట్లపాలెం: స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం సూచించారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విశాఖ జిల్లా శాఖ ఆధ్వర్యంలో రైల్వే న్యూ కాలనీలో గల ఈస్ట్‌కోస్ట్ రైల్వే స్కౌట్ కేంపింగ్ సెంటర్‌లో శనివారం వరల్డ్ థింకింగ్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి స్కౌట్స్ అండ్ గైడ్స్ సంఖ్య పెరిగేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. శిక్షణ పొందిన విద్యార్థులకు ఉద్యోగాలు, ఇతర రంగాల్లో ప్రభుత్వం కల్పించిన రిజర్వేషన్ల శాతం మరింత పెంచితే ఎక్కువ మంది ఆసక్తి చూపుతారన్నారు. ఇదే విషయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తమ కమిషన్ తీసుకెళ్తుందన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలోని మరిన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ సంఖ్య పెంచేందుకు కృషి చేస్తామన్నారు. వరల్డ్ థింకింగ్ డే సందర్భంగా నిర్వహించిన పోటీల విజేతలకు సర్టిఫికెట్స్, జ్ఞాపికలు అందజేశారు. ఈస్ట్‌కోస్ట్ రైల్వే స్కౌట్స్ సంస్థ కార్యదర్శి కేఆర్ జగన్నాథం, సంస్థ వైస్ ప్రెసిడెంట్ నరవ ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

24న ఘంటసాల స్వర నీరాజనం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

అల్లిపురం: ఈ నెల 24న జరగనున్న ఘంటసాల స్వర నీరాజనం సినీ సంగీత విభావరిని విజయవంతం చేయాలని పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి కోరారు. సూర్యాబాగ్‌లోని తన కార్యాలయంలో శనివారం దానికి సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.ఎన్.కె.మహంతి, చెన్నా తిరుమలరావు మాట్లాడుతూ అమర గాయకుడు ఘంటసాల 51వ వర్ధంతిని పురస్కరించుకుని ఈ నెల 24 సాయంత్రం 6 గంటలకు ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఘంటసాల స్వర నీరాజనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సినీ, కళా, సామాజిక సేవా రంగాలకు సేవలందిస్తున్న డాక్టర్ కంచర్ల అచ్యుతరావుకు కళామిత్ర బిరుదు ప్రదానం చేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం ప్రముఖ సంగీత విద్వాంసుడు చిప్పాడ సోమేష్ సంగీత నిర్వహణలో ఘంటసాల సినీ సంగీత విభావరి జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సినీ, కళా, రాజకీయ రంగాల ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు.

‘బర్మా క్యాంప్ కథలు’ పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వకళా పరిషత్ తెలుగు శాఖ, అరసం విశాఖ జిల్లా శాఖ సంయుక్త ఆధ్వర్యంలో హరివెంకటరమణ రాసిన బర్మా క్యాంప్ కథలు పుస్తకావిష్కరణ సభ శనివారం ఏయూ తెలుగు విభాగంలో జరిగింది. విజయకుమార్ మార్కిస్ట్ అధ్యయన కేంద్రం అధ్యక్షుడు జె.వి.సత్యనారాయణమూర్తి నిర్వాహకులతో కలసి పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ బర్మా మిలటరీ ప్రభుత్వం పంపిచేస్తే పొట్ట చేతపట్టుకొని వచ్చినటువంటి బర్మా కాందిశీకుల అనుభవాలు, కష్టాలు, నష్టాలు అన్నీ కూడా ఈ కథల్లో కనిపిస్తాయని చెప్పారు. భావితరాలకు వర్తమానంలో జరిగే సంఘటనల గురించి తెలియాలంటే ఇలాంటి కథలు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఆచార్య అన్నం శెట్టి ఈశ్వరమ్మ, అరసం కార్యదర్శి ఉప్పల అప్పలరాజు, బసు పోతన, బర్మా క్యాంప్ కథల పుస్తకం పబ్లిషర్స్ సాయివంశీ గుండ్ల వెంకట్ నారాయణ, డాక్టర్ కె.వి.ఎస్. హరి వెంకటరమణ తల్లి అనంత లక్ష్మి, ఏయూ తెలుగు శాఖ విద్యార్థులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల పెన్షన్ అప్‌డేట్‌కు డిమాండ్

సీతంపేట: విశ్రాంత ఉద్యోగుల పెన్షన్ అప్‌డేట్ చేయాలని, పదేళ్లుగా పెన్షన్ అప్‌డేట్ కాక ఎంతో నష్టపోతున్నామని ఆంధ్రా బ్యాంక్ విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ ప్రెసిడెంట్ వారణాసి కృష్ణమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. అసోసియేషన్ రెండో ప్రాంతీయ సమావేశం శనివారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఐదేళ్లకు పెన్షన్ రివైజ్ చేయాల్సి ఉన్నా గత పదేళ్లుగా చేయలేదన్నారు. పదవీ విరమణ చేసినప్పుడు ఎంత బేసిక్ ఉందో అంతే ఉందని, దీనివల్ల విశ్రాంత ఉద్యోగులు ఆర్థికంగా నష్టపోతున్నారని వాపోయారు. ఉద్యోగుల ఇన్సూరెన్స్ ప్రీమియం చాలా ఎక్కువగా ఉండటం వల్ల, పెన్షన్ కంటే ప్రీమియం ఎక్కువగా ఉంటోందని, ప్రీమియంలో కొంత భాగం బ్యాంకు యాజమాన్యం భరించాలని కోరారు. ముందుగా బ్యాంకు వ్యవస్థాపకులు భోగరాజు పట్టాభి సీతారామయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. సమావేశంలో అడ్వైజర్లు జి.ఎ స్.వి.కృష్ణారావు, సత్యప్రసాద్, డీజీఎస్ వి.వాసుదేవ మూర్తి, ఏజీఎస్ టంకాల కామేశ్వరరావు, సీసీఎం మూల భాస్కర్, కోశాధికారి ఎం.జయరావు, అసోసియేషన్ ప్రతినిధులు, సభ్యులు, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

రోడ్డెక్కిన భవన నిర్మాణ సామగ్రి



20వ వార్డు ఈస్ట్ పాయింట్ కాలనీ రోడ్డు మీద వేసిన డెబ్రిస్



22వ వార్డు రాజీవ్‌నగర్‌లో రహదారిపై భవన నిర్మాణ సామగ్రి

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 20, 22 వార్డుల్లో ఏ రోడ్డు మీద చూసినా భవన నిర్మాణ సామగ్రి, డెబ్రిస్ దర్శనమిస్తున్నాయి. ఈ వార్డుల్లో భారీ బహుళ అంతస్తుల భవనాల నిర్మాణం పెద్ద సంఖ్యలో జరుగుతుండటంతో వాటి సామగ్రి మొత్తం రోడ్ల మీదే వేస్తున్నారు. కొన్ని చోట్ల భవన నిర్మాణ వ్యర్థాలను సైతం రోడ్డు మీదే పడేస్తున్నారు. దీని వల్ల వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ముఖ్యంగా ఈస్ట్ పాయింట్ కాలనీ, పిఠాపురం కాలనీ, రాజీవ్‌నగర్ తదితర ప్రాంతాల్లో రహదారులను ఆక్రమించి భవన నిర్మాణ సామగ్రి, వ్యర్థాలను వేయడంపై పలువురు స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ అధికారులు దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



22వ వార్డు పిఠాపురం కాలనీలో రోడ్డుపై భవన నిర్మాణ సామగ్రి